# సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం మరణించటం ప్రజలకెన్నటికీ గర్వకారణం కాబోదు

**అమెరికాలో** మొదటి ప్రపంచ యుద్ధానికి సంబంధించి పదివేల వరకు స్మారక చిహ్నాలున్నాయని మొదటి ప్రపంచయుద్ధ సమగ్ర జాబితా పథకం తెలియజేస్తోంది. వాటిలో అన్నింటికన్నా ప్రసిద్ధమైనది కాన్సస్ నగరానికి దగ్గరలోనున్న 217 అడుగుల ఎత్తున్న 'లిబర్టీ టవర్'. మొదటి ప్రపంచ యుద్ధంలో అమెరికాకు చెందిన అత్యున్నత మిలటరీ కమాండర్ జనరల్ జాన్ జె. పెర్షింగ్ స్వస్థలానికి దగ్గర్లో ఇది ఉన్నది. 1982లో వియత్నాం యుద్ధ స్మారక చిహ్నం, ఆ తర్వాత కొరియా యుద్ధానికి, రెండవ ప్రపంచ యుద్ధానికి సంబంధించిన స్మారక చిహ్నాలు అమెరికా రాజధానిలో వెలిశాయి.

మొదటి ప్రపంచ యుద్ధంలో అమెరికాలో అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేసిన యువకుడు ఫ్రాంక్ బకిల్స్ మొదటి ప్రపంచ యుద్ధంలోని చివరి రెండు సంవత్సరాల కాలంలో అమెరికన్లు పోషించిన కీలకమైన పాత్ర గురించి, ఏవిధమైన స్మారక చిహ్నాలు లేకపోవటాన్ని 2008లో ఎత్తిచూపిన విషయం చర్చనీయాంశమైంది. ఎట్టకేలకు 2014లో అమెరికా పాలకవర్గాలు రెండు స్మారక చిహ్నాలను నిర్మించటానికి ఒప్పుకున్నాయి. ఒకటి కాన్సస్‌లో, ఇంకొకటి వాషింగ్టన్‌లో. నూరేళ్ళ మొదటి ప్రపంచయుద్ధ కమీషన్ పెర్షింగ్ పార్క్ నిర్మించటానికి అంగీకరించింది. దీనికి సంబంధించిన పనులు నవంబర్ 11, 2018 నాటికి ప్రారంభమౌతాయని భావిస్తున్నారు.

ఇక్కడ విషయమేమంటే సామ్రాజ్యవాద శక్తులు రెండు ప్రపంచ యుద్ధాలలోనూ ఇతర దేశాల సరిహద్దులలో తమ తమ సామ్రాజ్యవాద శత్రువులతో యుద్ధం చేశాయి. ఆయా ప్రాంతాలపై తమ దోపిడీని, అణచివేతను నిలబెట్టుకోవటానికి, విస్తృతం గావించు కోవటానికి, ఈ సామ్రాజ్యవాద యుద్ధాలలోకి ప్రజలను లాగటానికి వారు దేశభక్తి, జాతీయ ప్రయోజనాలు వంటి అందమైన పదాలనుపయోగించారు.

అమెరికా సాగించిన వియత్నాం, కొరియా యుద్ధాలు దురాక్రమణ పూరితమైనవి. ఈ యుద్ధాలలో అమెరికా ప్రజలు గర్వపడటానికేమీ లేదు. అమెరికా సామ్రాజ్యవాదులు అమెరికా ప్రజలపై ఈ యుద్ధాలను రుద్దారు. వియత్నాం ప్రజలను, కొరియా ప్రజలను చంపటానికి ఈ సామ్రాజ్యవాద యుద్ధాలలో ఒక సాధనమైనందుకు అమెరికా సైనికులు సిగ్గుపడిన, బాధపడిన ఉదంతాలు అనేకం. తమ సామ్రాజ్యవాద పాలకులకు వారు ఎదురు తిరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. వియత్నాం ప్రజలపై అమెరికా సాగించిన దురాక్రమణ యుద్ధానికి వ్యతిరేకంగా అమెరికాలోని శాంతికాముకులు, ప్రజాస్వామికవాదులు అనేకమంది అనేకమార్లు వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు చేశారు. అంతేకాక అమెరికా దురాక్రమణలకు వ్యతిరేకంగా ఆయా దేశాల పీడిత ప్రజల న్యాయమైన పోరాటాలకు వారు తమ సంఘీభావాన్ని తెలియజేశారు కూడా.

సామ్రాజ్యవాద శక్తులు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులు తమ చొరబాటు విధానాల నుండి, దురాక్రమణ విధానాల నుండి, వివిధ ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల ప్రజల చేతిలో అనేక ఓటముల నుండి ఏమాత్రం గుణపాఠాలను నేర్వలేదు. ప్రస్తుతం అమెరికా సామ్రాజ్యవాదులు ప్రపంచాధిపత్యం కోసం అర్రులు చాస్తున్నారు. ఇందులో భాగంగా అత్యంత అధునాతనమైన, వినాశకరమైన పెద్ద ఆయుధ సామ్రాజ్యాన్ని వారు నిర్మించారు. డజన్లకొద్దీ మిలటరీ స్థావరాలను నేలపైన, సముద్రంలోనూ, అంతరిక్షంలోనూ నిర్వహిస్తున్నారు. ప్రపంచస్థాయిలోనూ, ప్రాంతీయ స్థాయిలోనూ అనేక మిలటరీ పొత్తులు పెట్టుకుంటున్నారు. బలహీనమైన దేశాలను అణచి ఉంచటానికి బెదిరించటం, భయపెట్టడం, బలప్రయోగం చెయ్యటం, ఆయా దేశాల ఆంతరంగిక విషయాలలో జోక్యం చేసుకోవటం, సాయుధ చొరబాట్లు వంటి కార్యక్రమాలలో నిండా మునిగి ఉంటున్నారు. ఆఫ్ఘనిస్తాన్‌పై, ఇరాక్‌పై వారు సాగించిన దురాక్రమణ యుద్ధాలు వారి వ్యూహంలో ఒక భాగం మాత్రమే. టెర్రరిజంపై ప్రపంచపోరు, సిరియా వంటి దేశాలలో 'విధ్వంసక ఆయుధాలకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యం కొరకు, ప్రజాస్వామిక పాలన కొరకు' అంటూ వారు చెబుతున్నదంతా ప్రపంచాధిపత్యం కోసం వారి క్రూరమైన ఆరాటాన్ని తెలియజేస్తున్నాయి. లక్షలాది మంది పేద ప్రజలు సైనికులుగా, సాంకేతిక సిబ్బందిగా ప్రపంచాధిపత్యం కోసం సామ్రాజ్యవాదులు ఆడుతున్న జూదంలో సమిధలవుతున్నారు. ఒక దుర్మార్గమైన కారణం కోసం వారు ఉపయోగపడుతున్నారు. అంతేకాక కిరాయి మూకలుగా కూడా సామ్రాజ్యవాదులకు ఉపయోగపడుతున్నారు.

సామ్రాజ్యవాద శక్తులుగానీ, మరింకే నిరంకుశ పాలకులైనాగానీ తమ కొరకు ప్రాణాలొడ్డినవారిని హీరోలుగా, అమరులుగా సత్కరించటానికి ముందుంటారు. వారి మరణం ఎంతో గర్వకారణమైనదిగా చూపించటానికి అన్ని మార్గాలనూ వాడుకుంటారు. అమెరికాలో నెలకొల్పిన, నెలకొల్పాలనుకుంటున్న స్మారక చిహ్నాలన్నీ దీన్నే సూచిస్తున్నాయి. మొదటి ప్రపంచయుద్ధకాలంలో (1914–18) బ్రిటిష్ వలసపాలకులు ఇండియాతో సహా తమ వలసదేశాల ప్రజలను – అక్కడి జాతీయోద్యమాలను అణచివేయటానికి కిరాయి సైన్యంగా ఉపయోగించుకోవటం మాత్రమేకాక, కొత్త వలసల కోసం, ఉన్న వలసలను రక్షించుకోవటం కోసం తమ సామ్రాజ్యవాద శత్రువులపై సాగించే దోపిడీ యుద్ధాలలో సైన్యంగా వినియోగించుకున్నారు. అదే బ్రిటీషు పాలకులు మొదటి ప్రపంచ యుద్ధ వందేళ్ళ సంబరాలు జరుపుకునే సన్నాహంలో మునిగి తేలుతున్నారు. బ్రిటిషు వలస పాలకుల కోసం మరణించిన వారి జ్ఞాపకార్థం ఒక స్మారక చిహ్నాన్ని, ఒక మ్యూజియంను వారు నిర్మించారు. ఈ యుద్ధంలో అమరులైనవారిని, హీరోలను సత్కరించటానికి బ్రిటనులోను, ఇండియాతో సహా గత వలసలలోనూ వారు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆకలితో అలమటిస్తూ, నిరుద్యోగులైన పేద ప్రజలు కిరాయి సైన్యంలో చేరక మరోదారి లేని స్థితిలో వారి విలువైన జీవితాలను కోల్పోవటం పట్ల మనం విచారాన్ని, సానుభూతిని వ్యక్తం చేయాల్సిందే. అదే సమయంలో ఇతర దేశాల ప్రజలను అణచి వుంచటానికి, బానిసలను చేసుకోవటానికి సామ్రాజ్యవాద శక్తుల అధర్మ యుద్ధాలలో ఫిరంగి గుళ్ళలా ఉపయోగ పడ్డారన్నది గమనంలో ఉంచుకోవాలి. అమెరికా ప్రజలు మాత్రమే కాదు, సామ్రాజ్యవాద శృంఖలాలను బద్దలు కొడితే తప్ప స్వతంత్రులు కాలేమని అన్ని సామ్రాజ్యవాద దేశాల ప్రజలు తెలుసుకోవాలి. శ్రామికవర్గం, అణగారిన ప్రజలు, శాంతికాముక శక్తులు ఈ నేలపై సామ్రాజ్యవాదాన్ని తుదముట్టించటానికి సాగిస్తున్న వివిధ పోరాటాలలో వారూ భాగస్వాములవ్వాలి.

ooooo